క్లుప్తంగా

ఇంగ్లిష్ పరీక్షకు 450మంది హాజరు



వంతరాం పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ-1సామల

బలిజిపేట: పదవతరగతి పరీక్షలలో మూడో రోజు ఇంగ్లీషు పరీక్ష మండలంలో ప్రశాంతంగా జరిగిందని ఎంఈఓ-1సామల సింహాచలం తెలిపారు. మూడు పరీక్షా కేంద్రాలలో 450మంది పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ చెప్పారు. బలిజిపేట ఎ-కేంద్రంలో 150మంది, బి-కేంద్రంలో 138మంది, వంతరాంలో 163మందికి 162మంది హాజరయ్యారన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



బలిజిపేటలో ఏర్పాటుచేసిన చలివేంద్రం

బలిజిపేట: బలిజిపేటలో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. వేసవికాలంలో 20 శుక్రవారాల పాటు ఈ చలివేంద్రాన్ని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు కన్వీనర్ వి.సుబ్బారావు తెలిపారు. బలిజిపేటలో ఉన్నత పాఠశాల ఎదురుగా దీనిని ఏర్పాటుచేయడం వల్ల సుమారు 3వేల మంది దాహార్తి తీర్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

సత్యవతమ్మకు నివాళులర్పించిన రాజన్నదొర



సత్యవతమ్మకు నివాళులు అర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: వైఎస్సార్‌సీపీ మహిళావిభాగం జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పద్మావతి, పెదబోరబంద సర్పంచ్ కళ్లేపల్లి త్రినాథల మాత్యమూర్తి కళ్లేపల్లి సత్యవతమ్మకు మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర శుక్రవారం నివాళులర్పించారు. సత్యవతమ్మ ఇటీవల మరణించిన నేపథ్యంలో పెద్దకర్మలో పీడిక రాజన్నదొర పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెదబోరబందలోని వారి ఇంటికి వెళ్లి సత్యవతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ రెడ్డి సురేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దండి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీల అధ్యక్షుడు మాదిరెడ్డి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

సాలూరులో పీ4 గ్రామసభలు



మాట్లాడుతున్న అధికారులు

సాలూరు: పట్టణంలోని కోటవీధి, 4వ సచివాలయం పరిధిలో పీ4 గ్రామసభలను మున్సిపల్ అధికారులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీ4 సర్వే ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన పెంపొందించారు. విజన్ 2047లో భాగంగా, పేదలకు పెద్దల నుంచి చేయూత అందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని మున్సిపల్ మేనేజర్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధి వేతన బకాయి బిల్లులు చెల్లించరా..ప్లీజ్

సాలూరు రూరల్: ఉపాధి వేతనదారుల వేతన బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కూలీ సంఘం నాయకుడు తాడంగి గాసి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఉపాధి వేతనదారులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు తాడంగి గాసి మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రెండవ పూటలా పని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి కుటుంబానికి 200 రోజులు పనిదినాలు ఇవ్వాలని, రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని కోరారు. మండలంలో ఉపాధిపనులు ప్రారంభమై నెలలు గడుస్తున్నా ఇంతవరకు వేతనాలు చెల్లించకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘం నాయకుడు మర్రి శ్రీనివాసరావు ఆదివాసీ సంఘం నాయకుడు కూనేటి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

వీఏఓలకు మెటీరియల్ పంపిణీ

పాచిపెంట: ఉల్లాస్ పథకంలో భాగంగా ఆదివారం అక్షరాస్యతపరీక్ష నిర్వహణ కోసం వీఏఓలకు పరీక్ష నిర్వహణ మెటీరియల్‌ను ఎంపీడీఓ పాత్రో అందించారు. ఈ మేరకు శుక్రవారం తన కార్యాలయంలో ఈ సామగ్రిని పంపిణీ చేశారు.

నయనానంద కరం కావాలంటే..!


- కళ్లు జాగ్రత్తగా చూసుకోవాలి
- అధిక ఉష్ణోగ్రతతో కంటిచూపుపై ప్రభావం

పార్వతీపురంటౌన్:

ప్రపంచంలోని జీవరాశులన్నింటికీ అత్యంత ముఖ్యమైన అవయవం కళ్లు. కళ్లపనితీరును బట్టి జీవన విధానం ఉంటుంది. మానవ దేహంలో కళ్లే అత్యంత ప్రాధాన్యం కలిగినవి. మన ఊహాగానాలు బంధించి అపురూపమైన అనభవాలను మనకు మిగిల్చే కళ్లే లేకపోతే జీవితం అంతా అంధకారం. పుట్టుకతో కళ్లు లేకుంటే అది పూర్తిగా చీకటి ప్రపంచం. కంటి జబ్బులతో చూపు కోల్పోతే అది ఇంకా నరకం. కొంతకాలం వెలుగుల ప్రపంచాన్ని చూశాక చూపు కోల్పోయి చీకటి అయితే మనిషి భరించడం చాలా కష్టం. అందుకే కళ్లను నిత్యం కాపాడుకోవడం మన బాధ్యత అని గుర్తుంచుకోవాలి. ఇప్పుడున్న వైద్య సదుపాయాలతో కంటిని కాపాడుకోవడం చాలా తేలిక కావడం అదృష్టం. కళ్లు నిత్యం తడిగా ఉంటాయి. కంటినిండా నీరు ఉంటుంది. మనిషి నిర్లక్ష్యం కారణంగా కంటిలో తడి ఆరిపోయి చూపు పోయే ప్రమాదం ఉంది.

వేసవి కాలంలో ప్రమాదం..

వేసవి కాలంలో ఎండలు తీవ్రంగా ఉన్నందును ఉష్ణోగ్రతలు పెరిగి వేడికి కన్ను పొడిబారి మనిషి దుష్ప్రవర్తన కారణంగా కంటి సమస్యలు ఏర్పడి చూపు కోల్పోయి అంధత్వానికి దారితీస్తుంది. మనిషి నిమిషానికి ఎనిమిది సార్లు కంటి రెప్పలు ఆర్పుతూ ఉంటాడు. అలా చేయడం ద్వారా కార్నియాకు అవసరమైన నీరు చేరి కళ్లు ఎండిపోకుండా చేస్తుంది. ఈ కాలంలో ప్రయాణిస్తున్న వారికి వేడిగాలుల దృష్ట్యా తడి ఆరిపోయి కంటిలో లూబ్రికేటింగ్ (సరళత) తగ్గి దురద పెరిగి చూపు తగ్గి, వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వేసవి ప్రయాణంలో కంటి రెప్పలు నిమిషానికి రెండు నుంచి మూడుసార్లు మాత్రమే కొట్టుకుంటున్నాయని ఒక సర్వేలో వెల్లడించారు. దీని ఫలితంగా కంటి సమస్యలు వచ్చి చూపు తగ్గే అవకాశం, తీవ్రమైన తలనొప్పి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.





పొడిబారిన కన్ను లక్షణాలు:

- వెలుతురులో కళ్లు స్పష్టంగా కనబడకుండా ఉండడం
- నిలువుగా ఉన్న వస్తువులు, వైర్లు, గీతలు వంగినట్లు కనిపించడం
- కళ్లముందు ఉన్న ప్రదేశంలో చుక్కలుగా కనిపించడం
- ఒకే వస్తువు రెండుగా కనిపించడం
- దీపం గాని బల్బు గాని దాని చుట్టూ ఇంద్ర ధనుస్సు లాగా రంగులు కనిపించడం
- కంప్యూటర్ వద్ద పనిచేస్తున్న వారికి తీవ్రంగా తలనొప్పి, కళ్లు తిరగడం, దురద, మంట, నీరు కారడం

ఈ జాగ్రత్తలు పాటించాలి



వేసవి కాలంలో ప్రయాణిస్తున్న వారు తప్పనిసరిగా కళ్లజోళ్లు ధరించాలి. ప్రయాణంలో సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలి. కంప్యూటర్ వద్ద గంటల కొద్దీ గడపరాదు. కంటిరెప్పలు ఎక్కువ సార్లు కొట్టుకునే విధంగా ప్రయత్నించాలి. తరచూ ముఖాన్ని చల్లని నీటితో కడుక్కునే ప్రయత్నం చేయాలి. కంటికి దురద వచ్చే సమయంలో చేతితో నలపరాదు. ఈ వేసవి కాలంలో ప్రతి ఒక్కరూ కళ్లపై అత్యంత శ్రద్ధ వహించి కంటికి ఎక్కువ వేడి తగలకుండా కళ్లజోళ్లు ధరించి చూపు కాపాడుకోవాలి.

– డాక్టర్ నగేష్ రెడ్డి,
జిల్లా కంటి వెలుగు నేత్ర వైద్యాధికారి

6వారాల బకాయి బిల్లులు చెల్లించరా?



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధి వేతనదారులు

- ఉపాధి వేతన దారుల ధర్నా

బలిజిపేట: తమకు బకాయి ఉన్న ఆరు వారాల ఉపాధి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ వేతనదారులు బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల శాఖ అధ్యక్షుడు, కార్యదర్శి పి.వెంకటస్వామి, ఎస్.ఈశ్వరరావులు మాట్లాడుతూ వ్యవసాయ పనులు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలసబాట పడుతున్నారన్నారు. వలసలు నివారించేందుకు చేపట్టిన ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించి పనులు నిర్వహిస్తున్నా బిల్లులు సకాలంలో రాకపోవడంతో వేతనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రజలు ఎటువంటి పనులు అడిగితే అటువంటి పనులు ఇవ్వాలని, ఉదయం 7గంటలనుంచి 11గంటల వరకు మాత్రమే ఉపాధి పని చేయించాలని, పని ప్రదేశంలో మౌలిక సదుపాయాల కల్పన ఉండాలని, మెడికల్ కిట్ అందించాలని, మేట్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయ సిబ్బందికి అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు, విశ్వేశ్వరరావు, శివరాం, లక్ష్మణ, అసిరయ్య, ఉపాధివేతనదారులు పాల్గొన్నారు.

గ్రీన్‌అంబాసిడర్లు శిక్షణ వినియోగించుకోవాలి

సీతానగరం: గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరించే గ్రీన్‌అంబాసిడర్లు, గ్రీన్‌కార్లు చెత్తనుంచి సంపద తయారు చేయడానికి అవగాహన కల్పించుకునేందుకు ఇస్తున్న శిక్షణతరగతులను వినియోగించుకోవాలని మండలపరిషత్ కార్యాలయం ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు స్థానిక మండలంలోని పెదభోగిలి ఎస్‌డబ్ల్యూపీసీలో నాలుగు మండలాల గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ కార్లకు నిర్వహించనున్న శిక్షణ తరగతులను శుక్రవారం ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు మండలాలకు చెందిన గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ కార్లకు ఈ నెల 21 నుంచి 29వ తేదీ వరకూ ఒక్కో మండలానికి రెండు రోజులు వంతున శిక్షణ నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె కుమారవర్మ, పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్‌అంబాసిడర్లు, ఎస్‌డబ్ల్యూపీసీల నిర్వాహకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ కార్యాలయం ఏఓ ఎం.ఎల్ఎన్ ప్రసాద్

అంటిపేటలో జిల్లా వ్యవసాయ అధికారి పర్యటన

సీతానగరం: మండలంలోని అంటిపేటలో జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్ శుక్రవారం పర్యటించి నువ్వుల పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడగా నువ్వు పంటలు వేసవి కాలంలో సాగు చేస్తున్నామని 2–3 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వారు తెలిపారు. డీఏఏ మాట్లాడుతూ జిల్లాలో 5 నుంచి 6 వేల ఎకరాల్లో నువ్వులు సాగు చేస్తున్నారని తప్పకుండా మంచి రకాలు సబ్సిడీపై రాబోయే కాలానికి అందిస్తామని తెలియజేశారు. అలాగే రైతులు నూర్పిడి యంత్రం కావాలని అడగ్గా ప్రస్తుతం నూర్పిడి యంత్రాలకు రూ.80,000 సబ్సిడీ ఇస్తున్నామని కావాల్సిన రైతులు ఈ నెలలో వ్యవసాయ అధికారిని కలవాలని సూచించారు. పర్యటనలో ఆయనతో పాటు మండల వ్యవసాయాధికారి అవినాష్ ఉన్నారు.

ముఖ్య కేంద్రాలకు బస్సు సౌకర్యం పెంచాలి

పార్వతీపురంటౌన్: పార్వతీపురం బస్‌స్టేషన్ నుంచి కొన్ని మండల కేంద్రాలు, ముఖ్యమైన గ్రామాలకు బస్సు సౌకర్యం పెంచాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న కోరారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం ఆర్టీసీ డిపో సీఏ సుమిత్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో అనేక పనుల కోసం ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, ప్రజలు, విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారన్నారు. జిల్లాలో ఎక్కువ ప్రాంతం ఏజెన్సీ కావడం వల్ల మూరుమూల ప్రాంతాల నుంచి బస్సు సౌకర్యం లేక చుట్టూ తిరిగి రావాల్సి వస్తోందన్నారు. భామిని నుంచి పార్వతీపురం రావాలంటే సీతంపేట, పాలకొండ వెళ్లి, అక్కడి నుంచి పార్వతీపురం రావడం వల్ల ఎంతో సమయం వృథా అవుతోం దన్నారు. పాచిపెంట నుంచి రావాలంటే సాలూరులో కొన్ని గంటలు బస్సుల కోసం చూడడం, పక్క జిల్లా రాజాం నుంచి కానీ, జిల్లాలో చివరన ఉన్న గలావిల్లి గ్రామం నుంచి కానీ పార్వతీపురం జిల్లా కేంద్రానికి వచ్చేసరికి మధ్యాహ్నం అయిపోతోంది. అలాగే వివిధ శారీరక రుగ్మతలతో వస్తున్న రోగులు సకాలంలో ఆస్పత్రికి చేరకపోవడంతో సమయానికి వైద్యం అందక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గరుగుబిల్లి సూరయ్య, జిల్లా నాయకుడు బొత్స మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



డిపో సీఏ సుమిత్రకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కారమెప్పుడు?

పార్వతీపురంటౌన్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు చీపురుపల్లి సింహాచలం కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2008వ సంవత్సరం నుంచి 2018 వరకు పీఎఫ్ ఖాతాలు మున్సిపల్ కమిషనర్ అకౌంట్స్‌లో లాగిన్ అయి ఉన్నాయని, వాటిని వ్యక్తిగత లాగిన్‌కి ఓపెన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆప్కాస్ విధానంలో చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సెలవులు తక్షణం మంజూరు చేయాలని కోరారు. రాత్రిపూట పనిచేసే కార్మికులకు కనీస వసతులు కల్పించాలని. రిపేర్లలో ఉన్న పనిముట్లు బాగు చేయించాలని లేదా కొత్తవి కొనాలన్నారు. కార్యక్రమంలో నాగవంశం శంకర్రావు, సీఐటీయూ జిల్లా నాయకుడు గొర్లి వెంకటరమణ, మామిడి శివ, గుంట్రెడ్డి గంగరాజు, గుంప స్వామి, కార్మికులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ యూనియన్ నాయకులు

మున్సిపల్ అధికారుల బెదిరింపు

- పన్నులు చెల్లించాలంటూ ఇళ్లకొచ్చి దూషణలు

పార్వతీపురంటౌన్: మార్చి నెల వచ్చిందంటే ఇంటిపన్నులు, కుళాయి పన్నులు చెల్లించాలని మున్సిపల్ అధికారులు ప్రకటన ద్వారా లేదా మైక్ ప్రచారాల ద్వారా పట్టణంలో ప్రచారం చేపట్టాలి. అందుకు భిన్నంగా పార్వతీపురం మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్నారు. పార్వతీపురంలోని దేవీనగర్ కాలనీలో ఇంటిపన్నులు, కుళాయి పన్నులు చెల్లించాలంటూ స్థానికులను బెదిరిస్తున్న పరిస్థితి నెలకొంది.

మున్సిపాల్టీకి చెందిన రెవెన్యూ అధికారులు ఇంటిపన్నులు, కుళాయి పన్నులు చెల్లించకపోతే ఇంటికి తాళం వేస్తాం. ఇన్నాళ్లూ కట్టకుండా ఏం చేస్తున్నారంటూ అసభ్య పదజాలం వాడుతూ దూషిస్తున్నారని కాలనీ వాసులు వాపోతున్నారు. ఎటువంటి ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండా కుళాయి కనెక్షన్లు కట్ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పన్నులు చెల్లించడానికి సమయం ఉంది కదా అని కాలనీ వాసులు అడిగితే కట్టకపోతే మీ అంతు చూస్తాం అంటూ బెదిరిస్తున్నారని వాపోతున్నారు.



దేవీనగర్‌లో మున్సిపల్ అధికారులు తొలగించిన కుళాయి

అసభ్య పదజాలంతో దూషణలు



మున్సిపల్ అధికారులు మా ఇంటికి వచ్చి ఇంటి పన్ను చెల్లించాలని అడిగారు. నాకు డ్యూటీకి సమయం అవుతోందని, రెండు మూడు రోజుల్లో పన్నులు చెల్లిస్తామని చెప్పినా వినిపించుకోకుండా అసభ్య పదజాలంతో అందరి ముందు తిడుతున్నారు. బిల్లు చెల్లించకపోతే నీ అంతు తేలుస్తానంటూ బెదిరిస్తున్నారు. మా కుటుంబం ఇంట్లో లేని సమయంలో ఎవరికీ ముందస్తు సమాచారం ఇవ్వకుండా, ఎటువంటి నోటీసులు పంపించకుండా కుళాయి కనెక్షన్ తొలగించారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి.

– కుమిలి శ్రీనివాసరావు, దేవీనగర్‌వాసి, పార్వతీపురం

సీపీహెచ్‌సీ శిక్షణలో డీఎంహెచ్ఓ సూచనలు

పార్వతీపురంటౌన్: సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ శిక్షణ ద్వారా నేర్చుకున్న నైపుణ్యంతో గ్రామీణస్థాయిలో మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు సూచించారు. స్టాఫ్‌నర్స్, ఏఎన్ఎంలకు సీపీహెచ్‌సీ శిక్షణ కార్యక్రమాన్ని బ్యాచ్‌ల వారీగా నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం ఎన్‌జీఓ హోంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు వ్యాధులకు గల మూల కారణాలు, వాటి నివారణోపాయాలు, ప్రాథమిక, అత్యవసర వైద్య సేవలకు సంబంధించి ఆరోగ్య సమస్యలను గుర్తించే విధానం, చికిత్స, నివారణ, వ్యాధులు ప్రబలకుండా కృషి చేయాలని సూచించారు. గర్భిణులు, శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహన్‌రావు, సిబ్బంది జగన్నాథం, యోగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురం: తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ 102 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం పట్టణంలోని సుందరయ్య భవనంలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ 102లో పనిచేస్తున్న కెప్టెన్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత తొమ్మిదేళ్ల నుంచి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్నప్పటికీ కేవలం రూ.7,860లు మాత్రమే జీతం ఇస్తున్నారన్నారు. బహిరంగ మార్కెట్‌లో ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ వారి జీతం మాత్రం తొమ్మిదేళ్ల నుంచి పెంచక పోవడం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల కాలపరిమితి మార్చి 31తో ముగుస్తుందని, పనిచేస్తున్న ఉద్యోగులకు కాంట్రాక్ట్ పరిమితిని పెంచుతూ నెలకు రూ.18,500లు వేతనం ఇవ్వాలని, సెల్‌ఫోన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

20 పంచాయతీల్లో 45 బోర్లకు మరమ్మతులు

సీతానగరం: మండలంలో అమలు చేస్తున్న క్రాస్ ప్రోగ్రాం ద్వారా గ్రామాల్లో తాగునీటి సరఫరాకు బోర్ల మరమ్మతులు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్ అన్నారు. గ్రామాల్లో జరుగుతున్న క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం వెంకటాపురం నీలకంఠాపురం గ్రామాల్లో బోరు మరమ్మతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రాస్ ప్రోగ్రాం వాహనం ద్వారా మెటీరియల్ సమకూర్చుకుని ఇప్పటివరకూ 20 పంచాయతీల్లో మోర్ మెకానిక్‌ల సహకారంతో 45 బోర్లకు మరమ్మతులు చేసినట్లు చెప్పారు. మెకానిక్ సత్యనారాయణ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సౌకర్యం కల్పించడానికి కాలనీల్లో 550 బోర్లను వినియోగంలోకి తీసుకురానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మెకానిక్‌లు బి.కృష్ణ వంగపండు కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తాగునీటి సరఫరా అధికారులు

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు సలహాలివ్వండి

- రాజకీయ పక్షాల ప్రతినిధులను కోరిన డీఆర్ఓ

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో అవసరమైన చోట్ల నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు తగిన సూచనలు, సలహాలివ్వాలని డీఆర్ఓ హేమలత వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు బీఎల్ఓలకు సంపూర్ణ సహకారం అందించాలని పిలుపునిచ్చారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఓటర్ల జాబితా స్వచ్ఛకరణపై జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నాటికి ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఓటర్లకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు 800–1200 మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి విభజించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించిందన్నారు. ఈ ప్రక్రియలో ఓటర్లకు 2 కిలోమీటర్ల లోపల పోలింగ్ కేంద్రం ఉండేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల హతుబద్ధీకరణలో ఓటర్లకు అనువుగా ఉండే ప్రాంతాలను గుర్తించి తగు సలహాలు, సూచనలివ్వాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఓ హేమలత

గృహనిర్మాణాలు పూర్తి చేయాలి

- ఎంపీడీఓ జీవీ రమణ మూర్తి

పార్వతీపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను పూర్తిచేయాలని పార్వతీపురం ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, తహసీల్దార్ జయలక్ష్మి అన్నారు. ఈ మేరకు శుక్రవారం వారు మండలంలోని నడిమి గదబవలస, మడకవానివలస, సంగంవలస గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణాల కోసం అదనపు సాయాన్ని ఇస్తున్న తరుణంలో త్వరితగతిన గృహ నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తి చేసి వినియోగించుకోవాలని కోరారు. వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న గృహాలను పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం అదనంగా నిధులు చెల్లించేందుకు శ్రీకారం చుట్టిందని గత ప్రభుత్వం చెల్లించిన మొత్తంతో పాటు ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75వేలు అదనంగా మంజూరు చేయనున్నట్లు లబ్ధిదారులకు స్పష్టం చేశారు. అనంతరం ఎంపీడీఓ గోశాలల వినియోగంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పదోతరగతి పరీక్షలు జరుగుతున్న పెదబొండపల్లి పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు.



సంగంవలసలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, తహసీల్దార్ జయలక్ష్మి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి కరుణాకర్

అసంపూర్తి గృహాలు పూర్తిచేయండి

సీతానగరం: మండలంలోని కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న పక్కాగృహాలు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా పరిశ్రమల అధికారి, మండలప్రత్యేక అధికారి కరుణాకర్ అన్నారు. ఈ మేరకు మండలంలోని పెదభోగిలి కాలనీలో ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం మండల అధికారుల బృందంతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో డీటీ ఉమామహేశ్వరరావు, ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు, హౌసింగ్ డీఈ సోమేశ్వరరావు, ఏఈ జానకీరాం, ఇంజినీరింగ్ సహాయకులు సంతోష్‌కుమార్, వీఆర్వో పైల కుమారస్వామి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న విశ్రాంత ఉద్యోగి

పార్వతీపురం రూరల్: దుర్బుద్ధితో ఇంకొకరి కష్టాన్ని దోచుకుని మోసాలు, అన్యాయాలకు పాల్పడుతున్న ఈ రోజుల్లో తనకు దొరికిన విలువైన బంగారు ఆభరాన్ని నిజాయితీగా ఓ విశ్రాంత ఉద్యోగి పోలీసులకు అప్పగించి ఆదర్శంగా నిలిచారు. పార్వతీపురంలోని వైకేఎం కాలనీలో జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. కొద్దిరోజుల క్రితం పార్వతీపురం వైకేఎం కాలనీ వద్ద ఉన్న టిఫిన్ సెంటర్ వద్ద బంగారు గొలుసు పడి ఉండడాన్ని గమనించిన అదే ప్రాంతానికి చెందిన విశ్రాంత ఉద్యోగి పుప్పాల చంద్రరావు దానిని తీసి ఎవరైనా పడేసుకున్నారేమోనని సమీపంలో ఉన్నవారిని అడగ్గా ఎవరిదీ కాదని సమాధానం రావడంతో పారేసుకున్న వారు మళ్లీ తిరిగివచ్చి అడుగుతారేమోనని ఎదురుచూశాడు. ఎవరూ రాకపోవడంతో శుక్రవారం ఎస్పీ కార్యాలయానికి వెళ్లి తనకు దొరికిన బంగారు గొలుసును ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డికి అందజేసి పోగొట్టుకున్న వారికి అందజేయాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా చంద్రరావు నిజాయతీని ఎస్పీ అభినందించి ప్రతి ఒక్క పౌరుడు నిజాయితీగా, బాధ్యతాయుతంగా మసులుకుంటూ ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. అలాగే బంగారు వస్తువు గురించి సమాచారం తెలిసిన లేదా పోగొట్టుకున్న వారు ఎవరైనా పార్వతీపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్పీ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.